సాక్షి
అనకాపల్లి
శుక్రవారం । 27 । సెప్టెంబర్ । 2024


మర్యాదపూర్వక కలయిక : తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితో ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, పార్టీ జిల్లా నేతలు బూడి ముత్యాలనాయుడు, బొడ్డేడ ప్రసాద్, కరణం ధర్మశ్రీ, జె.సుభద్ర, కంబాల జోగులు, కన్నబాబు రాజు, పెట్ల ఉమా శంకర్ గణేష్, అదీప్ రాజు, మలసాల భరత్‌కుమార్

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడిగా బూడి ముత్యాలనాయుడు


తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో ముత్యాలనాయుడు


సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పలు నియామకాలు చేపట్టినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడిగా మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడును నియమిస్తున్నట్టు ప్రకటించింది. అదే విధంగా విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడిగా మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, అల్లూరి సీతారామరాజు జిల్లా అధ్యక్షుడిగా పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజులను నియమించారు. పార్టీ పీఏసీ మెంబర్‌గా, ఎస్సీ విభాగం రాష్ట్ర అధ్యక్షురాలిగా మాజీ ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి నియమితులయ్యారు.

ముగిసిన సదరం క్యాంప్

- 530 మంది అర్హుల గుర్తింపు

అనకాపల్లి: స్థానిక ఎన్టీఆర్ క్రీడామైదానంలో నిర్వహిస్తున్న సదరం క్యాంపు గురువారంతో ముగిసిందని ఎన్టీఆర్ వైద్యాలయం సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు చెప్పారు. ఈ నెల 4 నుంచి నేటి వరకు జిల్లాలో వివిధ మండలాల నుంచి 711 మంది క్యాంపునకు హాజరుకాగా 530 మందిని ఎన్టీఆర్ భరోసా పింఛన్‌కు అర్హులుగా గుర్తించామన్నారు. గతంలో సదరం సర్టిఫికెట్ చేయించుకుని 80 శాతం వైకల్యం ఉన్న దివ్యాంగులను మాత్రమే ప్రభుత్వ నిబంధనల మేరకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లకు అర్హులుగా గుర్తించడం జరిగిందన్నారు.

బుద్ధిస్ట్ డెస్టినేషన్ లైట్ అండ్ సౌండ్ షో ప్రారంభం నేడు


బొజ్జన్నకొండ

తుమ్మపాల: ఈనెల 27న ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని బొజ్జన్నకొండ వద్ద బుద్ధిస్ట్ డెస్టినేషన్ లైట్ అండ్ సౌండ్ షోను ప్రారంభించనున్నట్లు కలెక్టర్ విజయ కృష్ణన్ ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ వర్చువల్‌గా దీనిని ప్రారంభిస్తారని చెప్పారు. బొజ్జన్నకొండ చాలా ఆహ్లాదకరమైన ప్రాంతమని, అటువంటి ప్రదేశాన్ని పర్యాటకంగా మరింత అభివృద్ధి చేసేందుకు టూరిస్ట్ ఎమినిటీ సెంటర్, లైట్ అండ్ సౌండ్ సిస్టమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. వేల సంవత్సరాల చరిత్ర కలిగిన బొజ్జన్నకొండ చుట్టూ అందమైన కొండలతో ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుందన్నారు. దేశంలో అత్యంత విలువైన వారసత్వ నిర్మాణాల్లో నేటికీ చెక్కుచెదరక నిలిచిన ఈ ప్రదేశం ఓ ముఖ్యమైన పర్యాటక గమ్యస్థానం అని పేర్కొన్నారు.

అంబేడ్కర్‌ను అవమానించిన ఎమ్మెల్యే రఘురామపై ఫిర్యాదు


ఏఎస్‌ఐ ప్రసాదరావుకు ఫిర్యాదు కాపీని అందిస్తున్న గ్లోబల్ రిపబ్లికన్ పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు లోవచంద్

మాడుగుల రూరల్ : ఇటీవల ఏలూరు జిల్లా ఉండి నియోజకవర్గం ఏలూరిపాడులో దళితులపై కక్షపూరిత ఆరోపణలు చేసి, అంబేడ్కర్ ఫ్లెక్సీని చించేసిన ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజుపై గ్లోబల్ రిపబ్లికన్ పార్టీ జిల్లా అధ్యక్షుడు లోవచంద్ గురువారం మాడుగుల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దేశద్రోహం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని కోరుతూ ఏఎస్‌ఐ ప్రసాదరావుకు ఫిర్యాదు కాపీని అందజేశారు. ఎమ్మెల్యేను బర్తరఫ్ చేయాలని లోవచంద్ డిమాండ్ చేశారు. లేని పక్షంలో వివిధ రూపాల్లో ఉద్యమాన్ని తీవ్రతరం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ విజయనగరం జిల్లా ఇన్‌చార్జి దెందేటి దేముడు, జిల్లా యువజన విభాగం కన్వీనర్‌లు దుండి సూర్యనారాయణ, జాగరపు మహేశ్వరరావు, బొత్స అప్పారావు పాల్గొన్నారు.

ఇసుకలోనూ కక్కుర్తే.!

- సముద్రపు ఇసుక కల్తీ చేసి యథేచ్ఛగా విక్రయాలు
- రెట్టింపు లాభాలు ఆర్జిస్తున్న మాఫియా
- కేసుల నమోదులోనూ తికమకలు

కల్తీకి కాదేదీ అనర్హం అని నిరూపిస్తోంది ఇసుక మాఫియా. యథేచ్ఛగా సముద్రపు ఇసుకను కలిపి విక్రయిస్తూ రెట్టింపు లాభాలు ఆర్జిస్తోంది. కూటమి ప్రభుత్వ నిర్వాకంతో ఏర్పడిన ఇసుక కొరత కారణంగా గత్యంతరం లేక భవన నిర్మాణదారులు కల్తీ ఇసుకను కొనక తప్పని దుస్థితి నెలకొంది.

నక్కపల్లి: పాయకరావుపేట నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం అండదండలతో ఇసుక మాఫియా రెచ్చిపోతోంది. సముద్ర తీర ప్రాంతాలతో పాటు, వాటిని ఆనుకుని ఉన్న జిరాయితీ, ప్రభుత్వ భూముల్లో ఇసుకను సీఆర్‌జెడ్ నిబంధనలు ఉల్లంఘించి యథేచ్ఛగా తవ్వకాలు జరుపుతోంది. ఇలా తవ్విన ఇసుకను.. నదుల్లో దొడ్డిదారిన తవ్విన ఇసుక, ప్రభుత్వ డిపోల్లో కొనుగోలు చేసిన ఇసుకలో కల్తీ చేసి విక్రయిస్తోంది. నక్కపల్లి మండలంలో డీఎల్ పురం, గునిపూడి, అమలాపురం, మూలపర, రాజయ్యపేట, బంగారయ్యపేట, పాయకరావుపేట మండలంలో కుమారపురం, కేశవరం, రాజవరం, పాల్మన్‌పేట, వెంకటనగరం, ఎస్.రాయవరం మండలంలో ఉప్పలం, రేవుపోలవరం, బంగారమ్మపాలెం, తదితర గ్రామాల పరిధిలో సముద్రపు ఇసుకను ఇష్టానుసారం తవ్వేస్తున్నారు. పొక్లెయిన్ల సహాయంతో రాత్రి వేళ తవ్వేసి సమీపంలో ఉన్న పొలాల్లో నిల్వ చేస్తున్నారు. ఇలా నిల్వ చేసిన ఇసుకలో నక్కపల్లి డిపోలో ప్రభుత్వం విక్రయిస్తున్న నది ఇసుకను తీసుకెళ్లి కలుపుతున్నారు. ఒక ట్రాక్టర్ నదిలో నుంచి తెచ్చిన ఇసుకలో రెండు ట్రాక్టర్ల సముద్రపు ఇసుకను మిక్స్ చేస్తున్నారు. ట్రాక్టర్ ఇసుక ధర డిపోలో రవాణా చార్జీలతో రూ.8125 అవుతోంది. దీనికి మరో రెండు ట్రాక్టర్ల సముద్రపు ఇసుకను కలపడంతో మొత్తం మూడు ట్రాక్టర్ల ఇసుక అవుతోంది. రూ.8125 పెట్టి కొనుగోలు చేసిన ఇసుకలో సముద్రపు ఇసుకను కలిపి రూ. 25 వేలకు విక్రయిస్తున్నారు. అంటే ఒక్క ట్రాక్టర్ ఇసుక దగ్గర ఖర్చులు పోను రూ.20 వేలు లాభం వస్తోంది. లారీలతో కూడా ఇలాగే విక్రయిస్తూ లక్షలాది రూపాయలు ఆర్జిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

కేసుల నమోదులోనూ మతలబు

ఇసుక అక్రమ తరలింపుపై నమోదవుతున్న కేసుల్లోనూ పోలీసులు చేతివాటం ప్రదర్శిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. సముద్రపు ఇసుక తవ్వి తరలిస్తున్న వాహనాలు తరచూ పోలీసులకు పట్టుబడుతున్నాయి. అయితే సముద్రపు ఇసుక తరలిస్తున్నారని కేసు నమోదు చేసి, సీజ్ చేస్తే ఆ వాహనం త్వరగా విడుదలయ్యే పరిస్థితి ఉండదు.


నక్కపల్లి డిపోవద్ద ఇసుక విక్రయాలు


డిఎల్‌పురం వద్ద కల్తీ చేసేందుకు సిద్ధం చేసిన సముద్రపుఇసుక

కానీ ఇసుక మాఫియా.. పోలీసులు, రెవెన్యూ, మైనింగ్ అధికారులపై తమ రాజకీయ పలుకుబడిని ఉపయోగించి పట్టుబడిన వాహనాల్లోని ఇసుక నదులు, వాగుల్లో తవ్వకాలు జరిపిందేనని కేసులు నమోదు చేయించుకుంటున్నారు. దీంతో ఆ వాహనానికి రూ.5 వేలు నుంచి రూ.10 వేలులోపు జరిమానా విధించి వదిలేస్తున్న పరిస్థితి నెలకొంది. ఈ నెలలోనే 8 లారీలు, 10 ట్రాక్టర్లలో తరలిస్తున్న సముద్రపు ఇసుకను పోలీసులు పట్టుకున్నారంటే తీర ప్రాంతంలో తవ్వకాలు ఎంత ఎక్కువగా జరుగుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. మరో వైపు ఇసుకను కల్తీ చేయడం వల్ల ప్రభుత్వ, ప్రైవేటు భవనాల్లో నాణ్యత లోపిస్తోంది. ఇలా నాసిరకం ఇసుకతో నిర్మించిన భవనాలు మూణ్నాళ్ల ముచ్చటగానే ఉంటున్నాయి.

నిర్మించిన కొద్ది రోజులకే బీటలు వారుతున్నాయి. సీఆర్‌జెడ్ నిబంధనల మేరకు సముద్రపు తీర ప్రాంత సమీప గ్రామాల్లో ఇసుక తవ్వకాలకు వీల్లేదు. ఈ నిబంధనలు కఠినంగా అమలు చేసే అధికారులు ఈ ప్రాంతాల్లో పర్యటిస్తున్న దాఖలాలు లేవని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

తనిఖీలు చేసి కేసుల నమోదు

ఇసుక సరఫరాపై ఎస్‌ఐ సన్నిబాబు వద్ద ప్రస్తావించగా.. తమకు ఫిర్యాదులు రావడంతో పాటు తమ సిబ్బంది దాడులు చేసే క్రమంలో ఇసుక వాహనాలు కనిపిస్తే తనిఖీలు చేస్తున్నామన్నారు. అనుమతులు లేకపోతే పట్టుకుని కేసులు నమోదు చేస్తున్నట్టు చెప్పారు. సముద్ర తీర ప్రాంతాల్లో ఇసుక తవ్వకాల విషయంలో ఆయా గ్రామాల వీఆర్వోలు పర్యవేక్షణ చేసి ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాల్సి ఉంటుందన్నారు.

కొలతల్లోనూ అక్రమాలు

డిపో వద్ద ఇసుక కొలతల్లో కూడా తేడా వస్తోందని, వేబ్రిడ్జిలో మాయాజాలం ప్రదర్శిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇసుక లోడింగ్ సమయంలో వేరొక ట్రాక్టర్ ఇంజిన్‌ను వేబ్రిడ్జిపై పెట్టి మోసాలకు పాల్పడుతున్నారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. బయటకు తీసుకెళ్లి ట్రాక్టర్ ఇసుకను తూకం వేయిస్తే ఈ మోసం బయటపడుతోందని, తిరిగి వచ్చి ప్రశ్నిస్తే డిపో నుంచి బయటకు వెళ్లిన తర్వాత తమకు సంబంధం లేదని తప్పించుకుంటున్నారని అంటున్నారు. స్థానిక ట్రాక్టర్ల యజమానులు ఒకసారి బుక్ చేసిన కూపన్‌తో రెండు, మూడు పర్యాయాలు ట్రాక్టర్‌తో ఇసుక తీసుకెళ్లి ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారని, ఇందుకు డిపో వద్ద ఉన్న సిబ్బంది సహకరిస్తున్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి.

సిండికేట్‌గా ట్రాక్టర్ యజమానులు

నక్కపల్లి డిపో వద్ద ఇసుక విక్రయాల్లో అక్రమాలు జరుగుతున్నాయని పలువురు వినియోగదారులు ఆరోపిస్తున్నారు. చుట్టు పక్కల గ్రామాలకు చెందిన ట్రాక్టర్ యజమానులు ఇక్కడ సిండికేట్‌గా ఏర్పడి, పక్క మండలాల నుంచి ఇసుక కోసం వచ్చిన వినియోగదారులు, ట్రాక్టర్ల యజమానులకు ఇసుక సరఫరా చేయనివ్వకుండా అడ్డుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులతో కుమ్మక్కై ప్రశ్నించిన వారిపై దాడులకు పాల్పడుతున్నారంటూ ఇతర మండలాల వినియోగదారులు వాపోతున్నారు. స్థానికులకు ముందుగా లోడింగ్ చేసిన తర్వాతే ఇతర మండలాల ప్రజలకు ఇస్తున్నారని, ఇలా చేయడం వల్ల డిపో వద్ద పక్క మండలాలకు చెందిన వాహనాలు రెండు నుంచి నాలుగు రోజుల వరకు బారులు తీరి ఉండాల్సి వస్తోందని చెబుతున్నారు.

తిరుమల పవిత్రతను కాపాడాలని కోరుతూ రేపు ప్రత్యేక పూజలు

- వైఎస్సార్‌సీపీ పాయకరావుపేట సమన్వయకర్త కంబాల జోగులు

నక్కపల్లి: కూటమి ప్రభుత్వ కుట్రలు, కుతంత్రాల కారణంగా తిరుమల వేంకటేశ్వర స్వామి వైభవాన్ని, పవిత్రతను, ఆలయ సంప్రదాయాలను కాపాడాలని కోరుతూ ఈ నెల 28న టీటీడీ అనుబంధ ఆలయం ఉపమాక వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే, పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త కంబాల జోగులు తెలిపారు. తిరుమల లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు కలిసిందని కూటమి పెద్దలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. చంద్రబాబు అండ్ కో నుంచి తిరుమల పవిత్రతను కాపాడి వెంకన్నను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోకుండా తనను తాను రక్షించుకోవాలని కోరుతూ పూజలు చేస్తున్నట్లు చెప్పారు. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ నెల 28న జగన్‌మోహన్‌రెడ్డి కూడా తిరుపతిలో స్వామివారిని దర్శించుకుని పూజలు చేయనున్నట్లు చెప్పారు. తిరుమల పవిత్రతను మంటగలుపుతూ కోట్లాది మంది వెంకన్న భక్తుల మనోభావాలు దెబ్బతినే విధంగా చంద్రబాబు అబద్ధపు ప్రకటనలు చేశారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డిని రాజకీయంగా ఎదుర్కోలేక ఆయన ప్రతిష్టను దెబ్బతీయడం కోసం తిరుమల ప్రసాదంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమానికి ఎంపీపీలు, జెడ్పీటీసీలు, కార్పొరేషన్ల మాజీ డైరెక్టర్లు, పార్టీ మండల అధ్యక్షులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, సీనియర్ నాయకులు, అనుబంధ విభాగాల నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలని జోగులు కోరారు.

తండ్రి కలలు సజీవం

కుమారుడి అవయవాలతో ముగ్గురికి ప్రాణదానం


అవయవదానం చేసిన సంతోష్ (ఫైల్)


హాస్పటల్ సీఈవోతో సంతోష్ తండ్రి సత్తిబాబు

చోడవరం: తన కొడుకూ.. అందరిలాగే ఆరోగ్యంగా నూరేళ్లు బతకాలనుకున్నాడు. చిన్నతనంలోనే రెండు కిడ్నీలు పాడై ప్రాణాపాయం వస్తే తన కిడ్నీ ఇచ్చి బతికించాడు. 23 ఏళ్ల వయసులో కుమారుడు హఠాత్తుగా మరణిస్తే.. అంత దుఃఖంలోనూ వేరొకరికి అవయవ దానం చేశాడు. ముగ్గురిని బతికించి వారిలో తన బిడ్డను చూసుకోవాలనుకుంటున్నాడు.. ఆ తండ్రి కలలు సజీవం. ఆ తండ్రీ కొడుకుల జన్మ ధన్యం. రావికమతం మండలం కొత్తకోటకు చెందిన బెల్లపుకొండ సత్తిబాబు తాపీమేస్త్రి పని చేస్తూ జీవిస్తున్నాడు. ఇతనికి ఇద్దరు కొడుకులు. సంతోష్ రెండో కుమారుడు. పదేళ్ల వయస్సు నుంచే సంతోష్‌కు ఆరోగ్యం బాగోలేదు. ఒక దశలో రెండు కిడ్నీలు పాడైపోవడంతో కొడుకును బతికించుకోవడానికి సత్తిబాబు తన కిడ్నీ ఇచ్చాడు. సంతోష్‌కి 23 ఏళ్లు వచ్చాయి. డిగ్రీ వరకు చదివాడు. విశాఖపట్నంలో ఒక ప్రైవేటు షాపులో పనిచేస్తూ కుటుంబానికి చేదోడుగా ఉన్నాడు. ఇంతలో రెండ్రోజుల కిందట సంతోష్‌కు ఆకస్మికంగా తలనొప్పి రావడంతో విశాఖపట్నంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అయినా ప్రయోజనం లేకపోయింది. సంతోష్ బ్రెయిన్‌డెడ్‌కు అయినట్టు వైద్యులు నిర్ధారించారు. సంతోష్ గురువారం మృతి చెందాడు. తన కొడుకు మృతి చెందినా ఆయన అవయవాల దానంతోనైనా కొందరిలో తన కొడుకు బతికి ఉంటాడని సత్తిబాబు భావించారు. ఊపిరితిత్తులు, కాలేయం, కళ్లు ముగ్గురికి దానం చేయాలని నిర్ణయించారు. వెంటనే రాష్ట్ర జీవన్‌దాన్ కో ఆర్డినేటర్ రాంబాబు పర్యవేక్షణలో సంతోష్ అవయవాలను దానం చేసే ప్రక్రియ చేపట్టారు. లంగ్స్‌ను గ్రీన్‌చానల్ ద్వారా హైదరాబాద్ తరలించగా ఊపిరితిత్తులు, కళ్లను సీనియార్టీ ప్రకారం కేటాయించారు. సంతోష్ చనిపోతూ ముగ్గురికి ప్రాణదానం చేశాడు. తండ్రి స్ఫూర్తితోనే ఇది సాధ్యమైంది. అందరికీ ఆదర్శంగా నిలిచింది.

సెయిల్‌లో విలీనమే సరైన పరిష్కారం

- సీఎం, డిప్యూటీ సీఎం, కేంద్ర ఉక్కు మంత్రిని కలిసేందుకు అఖిలపక్షం
- జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో తీర్మానం
- ముందు తీర్మానానికి అంగీకరించని టీడీపీ కార్పొరేటర్లు
- వైఎస్సార్‌సీపీ, సీపీఎం, సీపీఐ కార్పొరేటర్ల పట్టుతో దిగొచ్చిన 'కూటమి'


మేయర్ హరివెంకటకుమారి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం

విశాఖ సిటీ: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తీర్మానం విషయంలో ఎట్టకేలకు కూటమి కార్పొరేటర్లు దిగొచ్చారు. స్టీల్‌ప్లాంట్ అంశాన్ని టేబుల్ అజెండాలో చేర్చాలని వైఎస్సార్‌సీపీ, వామపక్ష పార్టీల కార్పొరేటర్లు కోరినప్పటికీ.. కూటమి సభ్యులు అడ్డుతగులుతూ వచ్చారు. దీంతో కౌన్సిల్ సమావేశం మూడు రోజుల పాటు నిర్వహించాల్సి వచ్చింది. మూడో రోజు కూడా టేబుల్ అజెండాలో చివరి అంశంగా స్టీల్‌ప్లాంట్‌ను చేర్చినప్పటికీ.. దానిపై చర్చించేందుకు చివరి క్షణం వరకు తటపటాయించారు. మిగిలిన పార్టీల సభ్యులంతా గట్టిగా పట్టుబట్టడంతో కూటమి కార్పొరేటర్లు దిగొచ్చారు. స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని కోరుతూ సీఎం, డిప్యూటీ సీఎం, కేంద్ర ఉక్కు శాఖ మంత్రిని కలిసేందుకు అఖిలపక్షం ఏర్పాటు చేయాలని తీర్మానం చేశారు. వరుసగా మూడు రోజు గురువారం జీవీఎంసీలో మేయర్ గొలగాని హరివెంకటకుమారి అధ్యక్షతన సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ప్రధాన అజెండాతో పాటు అనుబంధ, టేబుల్ అజెండాతో కలిసి మొత్తం 83 అంశాలపై చర్చించారు. వీటిలో 81 అంశాలను ఆమోద ముద్ర వేశారు.

యూజర్ చార్జీలు, ఆస్తి పన్ను తగ్గింపు రగడ

అజెండాను ప్రారంభించాలని మేయర్ చెప్పినప్పటికీ.. సీపీఐ, సీపీఎం ఫ్లోర్‌లీడర్లు యూజర్ చార్జీల రద్దు, ఆస్తి పన్ను తగ్గింపు, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తీర్మానాలు చేసేందుకు టేబుల్ అజెండాలో పెట్టాలని మేయర్‌ను కోరారు. దీనికి మేయర్ అంగీకరించి అధికారులకు ఆదేశించారు. దీనిపై కూటమి పార్టీ కార్పొరేటర్లు అడ్డుతగిలారు. ముందుగా స్టీల్‌ప్లాంట్ అంశంపై చర్చించడానికి కూడా అంగీకరించలేదు. తీర్మానం చేసే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. అలాగే చెత్తపై యూజర్ చార్జీలను ప్రభుత్వం రద్దు చేసిందని, మళ్లీ కౌన్సిల్‌లో తీర్మానం చేయాల్సిన అవసరం లేదని వాదించారు. దీనిపై వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు స్పందిస్తూ.. రద్దు చేసినట్లు ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేస్తే చూపించాలని ప్రశ్నించారు. దీనిపై సమాధానం చెప్పలేని కూటమి సభ్యులు ఒక్కసారిగా రెచ్చిపోయారు. అధికారంలోకి వచ్చాక చెత్త పన్ను వసూలు చేయడం లేదని చెప్పుకొచ్చారు. దీనిపై వైఎస్సార్ సీపీ, సీపీఎం, సీపీఐ సభ్యులు కలిగించుకొని జీవో ఇవ్వని పక్షంలో భవిష్యత్తులో మళ్లీ వసూలు చేసే అవకాశం ఉంటుందని, అందుకే కౌన్సిల్‌లో తీర్మానం చేసి పంపించాలని డిమాండ్ చేశారు. అలాగే ఆస్తి పన్నును 0.13 శాతం నుంచి 0.1కు తగ్గించాలని మేయర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ రెండు కోర్టు పరిధిలో ఉన్నాయని, అజెండాల్లో పెట్టి తీర్మానం చేస్తే కోర్టు ధిక్కరణ అవుతుందని టీడీపీ కార్పొరేటర్లు బుకాయించే ప్రయత్నం చేశారు. అయితే ఆస్తి పన్ను తగ్గించే అధికారం కౌన్సిల్‌కు ఉందని, ఇది కోర్టు ధిక్కరణ కిందకు రాదని వామపక్ష పార్టీల సభ్యులు చెప్పినప్పటికీ కూటమి కార్పొరేటర్లు అంగీకరించలేదు.

బీచ్ స్విమ్మర్లు/లైఫ్‌గార్డుల సేవలను మరో ఏడాది పాటు అవుట్ సోర్సింగ్ పద్ధతిలో వినియోగించుకునేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. ఈ అంశంపై వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు మాట్లాడుతూ 47 మంది లైఫ్‌గార్డులు తమ ప్రాణాలను తెగించి సముద్ర కెరటాల్లో చిక్కుకున్న అనేక మందిని రక్షించారని, వారికి ఆరు నెలలుగా జీతాలు ఇవ్వలేదని తెలిపారు. వారిని ఆప్కోస్‌లో విలీనం చేస్తే సరైన సమయంలో జీతాలు అందుతాయన్నారు. దీనికి మిగిలిన పార్టీల సభ్యులు అంగీకారం తెలిపారు.

ఔనా.. మరి ప్రమాదాలెందుకు జరుగుతున్నాయి?

ఫార్మా కంపెనీల ప్రతినిధులు : మేడం.. మా జిల్లా అధికారులు అద్భుతం. ఫ్యాక్టరీలో ఏ చిన్న పొరపాటు ఉన్నా ఒప్పుకోరు. ప్రతి నిబంధనని పక్కాగా పాటించాలని హెచ్చరిస్తూనే ఉంటారు. ఫ్యాక్టరీస్ విభాగం, ఏపీఐఐసీ, బాయిలర్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు.. ఇలా ప్రతి విభాగాల అధికారులు నిరంతరం శ్రమిస్తున్నారండీ.

వసుధా మిశ్రా : అవునా.. నిజంగానా.? అంత అద్భుతంగా ఉంటే.. మీరు అంత పక్కాగా నిబంధనలు పాటిస్తుంటే ప్రమాదాలు ఎందుకు జరుగుతున్నాయో.? మీరు చెప్పింది మీకైనా నమ్మశక్యంగా ఉందా.? ఇలాంటి మాటలు ఇంక ఆపండి. ఇకపై ప్రమాదాలు పునరావృతం కాకుండా ఉండేందుకు ప్రతి నిబంధన తప్పకుండా పాటించండి.

ఇదీ.. ప్రభుత్వం నియమించిన హైలెవల్ కమిటీకి, ఫార్మా కంపెనీల ప్రతినిధుల మధ్య జరిగిన సంభాషణ.


మాట్లాడుతున్న హైలెవల్ కమిటీ చైర్‌పర్సన్ వసుధా మిశ్రా, కలెక్టర్ విజయ కృష్ణన్


హాజరైన ప్రభుత్వాధికారులు, ఫార్మా సంస్థల యజమానులు

- ఫార్మా కంపెనీ ప్రతినిధుల మాటలకు హైలెవల్ కమిటీ చురకలు
- జిల్లా అధికారులు అద్భుతమన్న కంపెనీ ప్రతినిధులు
- అబద్ధాలెలా చెప్పగలుగుతున్నారంటూ నిలదీసిన చైర్‌పర్సన్

సాక్షి, విశాఖపట్నం : ఫార్మా ప్రమాదాల్ని నివారించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధ్యయనం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నియమించిన హైలెవల్ కమిటీ బృందం జిల్లాలో ఉన్న పలు సెజ్‌లలో పర్యటించింది. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి వసుధా మిశ్రా నేతృత్వంలో పర్యటించిన బృందం అచ్యుతాపురం, పరవాడ సెజ్‌లలో ఫార్మా కంపెనీల్ని పరిశీలించింది. ఈ సందర్భంగా లారస్ ల్యాబ్స్ యూనిట్-2లోని సమావేశ మందిరంలో వివిధ విభాగాల ఉన్నతాధికారులు, ఫార్మా కంపెనీల ప్రతినిధులతో కమిటీ సభ్యులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇటీవల ఎసైన్షియా, సినర్జీ కంపెనీల్లో జరిగిన ప్రమాదాల గురించి అధికారులు వివరించారు. అనంతరం ఫార్మా సంస్థల ప్రతినిధుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఈ సందర్భంగా ఫార్మా ప్రతినిధులు ఆయా ప్రభుత్వ విభాగాల అధికారుల గురించి ప్రస్తావిస్తూ.. వారంతా అద్భుతంగా పనిచేస్తున్నారంటూ కితాబిచ్చారు. దీనిపై కమిటీ చైర్‌పర్సన్ వసుధా మిశ్రా స్పందిస్తూ.. అంత అద్భుతంగా పనిచేస్తే.. ప్రమాదాలు వెంటవెంటనే ఎందుకు జరిగాయని ప్రశ్నించారు. దీంతో ఫార్మా కంపెనీల ప్రతినిధులు మౌనం దాల్చారు. మిశ్రా మాట్లాడుతూ.. కమిటీ వచ్చింది భవిష్యత్తులో మరో ప్రమాదం జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధ్యయనం చేయడానికి.. ప్రమాదానికి గల కారణాలు, చోటుచేసుకున్న వైఫల్యాలను కప్పిపుచ్చేందుకు అబద్ధాలు చెప్పేందుకు ప్రయత్నించవద్దని హితవు పలికారు. క్షేత్ర స్థాయిలో అసలు ఏం జరుగుతోందో.. ప్రతి ఒక్కరూ నిజాయితీగా చెబితేనే.. మరో ప్రమాదం జరగకుండా నివారించి.. కార్మికుల ప్రాణాలకు భద్రత కల్పించగలమన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలన్నారు. ఏ విభాగం.. ఎలా పనిచేస్తుందో తమ విచారణలో తేలుతుందని చైర్‌పర్సన్ మిశ్రా స్పష్టం చేశారు. హై లెవెల్ కమిటీ కన్వీనర్, డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ చంద్రశేఖర్ వర్మ, అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రీస్ ఎవి పటేల్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ చీఫ్ ఇంజనీర్ ప్రసాద్, డైరెక్టర్ ఆఫ్ బాయిలర్స్ ఉమామహేశ్వరరావు, ఆర్డీవో చిన్నికృష్ణ, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ హరిప్రసాద్, ఇండస్ట్రీస్ జీఎం శ్రీధర్ పాల్గొన్నారు.

ఐదుగురు తహసీల్దార్లకు బదిలీ

మహారాణిపేట (విశాఖ): ఉమ్మడి విశాఖ జిల్లాలో మరో ఐదుగురు తహసీల్దార్లకు బదిలీ జరిగింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్, ఉమ్మడి విశాఖ జిల్లా నోడల్ అధికారి ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. పద్మనాభం తహసీల్దార్ ఎం.ఆనంద కుమార్‌ను పెందుర్తి తహసీల్దార్‌గాను, పెందుర్తి తహసీల్దార్ కె.వేణుగోపాల్‌ను వీఎంఆర్‌డీఏ స్పెషల్ తహసీల్దార్(ఎల్ఏ)గాను బదిలీ చేశారు. అక్కడ పనిచేస్తున్న కె.ఆనందరావును పద్మనాభం తహసీల్దార్‌గాను, అల్లూరి జిల్లా కలెక్టరేట్ పర్యవేక్షకులు బి.చిన్నికృష్ణను అనకాపల్లి జిల్లాకు బదిలీ చేశారు.

జిల్లాలో ఆర్‌డీవోలకు బదిలీ

నక్కపల్లి: జిల్లాలో అనకాపల్లి, నర్సీపట్నం ఆర్‌డీవోలను బదిలీ చేస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. అనకాపల్లి ఆర్‌డీవోగా పనిచేస్తున్న చిన్నికృష్ణను జీఏడీకి బదిలీ చేస్తూ.. ఆయన స్థానంలో శిక్షణ పూర్తి చేసుకున్న షేక్ ఆయేషాను నియమించారు. నర్సీపట్నం ఆర్‌డీవోగా పనిచేస్తున్న జయరామ్‌ను కూడా జీఏడీకి రిపోర్ట్ చేయాలని ఆదేశిస్తూ.. ఆయన స్థానంలో శ్రీకాకుళం జిల్లా పాలకొండ ఆర్‌డీవోగా పని చేస్తున్న విల్లూరి వెంకటరమణను నియమించారు. రమణ గతంలో నక్కపల్లి, నర్సీపట్నం తహసీల్దార్‌గా పని చేశారు.

క్లుప్తంగా

జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపిక



విద్యార్థులతో శ్రీప్రకాష్ అధినేత నరసింహారావు

పాయకరావుపేట: అండర్ -17 బాలుర విభాగం సౌత్ జోన్ యోగా పోటీల్లో శ్రీ ప్రకాష్ విద్యార్థులు బి.దేవాన్ష్ నాయుడు, జి.సోమ సూర్యవరణ్, పి.సోహన్‌శ్రీ, సిహెచ్.జయదీప్, వి.చైతన్య బంగారు పతకాలు సాధించారు. వచ్చే నెల 2 నుంచి 5 వరకూ గుజరాత్‌లోని సూరత్‌లో ఎల్.పి. సావని అకాడమీలో జరిగే జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపిక య్యారని శ్రీ ప్రకాష్ విద్యానికేతన్ ప్రిన్సిపాల్ తెలిపారు. సి.బి.ఎస్.ఈ. బోర్డు ఆధ్వర్యంలో ఈ నెల 21 నుంచి 23 వరకూ తమిళనాడు చెంగల్ పేట్‌లోని శ్రీ గోకులం పబ్లిక్ స్కూల్లో నిర్వహించిన పోటీల్లో వారు సత్తా చాటారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు విద్యా సంస్థల అధినేత సిహెచ్.వి.కె నరసింహారావు, విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్ విజయ్‌ప్రకాష్, యోగా గురువులు సురేష్, జయంతి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు అభినందనలు తెలిపారు.

బాక్సింగ్ విజేతకు సత్కారం



బాక్సర్ మౌనికను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ రాజు, వెలగా నారాయణరావు

నర్సీపట్నం: గౌహతిలో జరిగిన నేషనల్ బాక్సింగ్ పోటీల్లో స్వర్ణ పతకం సాధించిన బొంతు మౌనికను ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రాజు, నింజాస్ అకాడమీ చైర్మన్ వెలగా నారాయణరావు ఘనంగా సత్కరించారు. అనంతరం బాక్సింగ్ కిట్టును నారాయణరావు అందజేశారు. మరింత తర్ఫీదు పొంది అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభకనబరిచి నర్సీపట్నంకు మంచి పేరు తీసుకురావాలని ప్రిన్సిపాల్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కోచ్ అబ్బు పాల్గొన్నారు.



పద్మాపురం గార్డెన్‌లో ఏర్పాటుచేసిన కాటేజీలు, పగోడాలు



వంపులు తిరిగిన మత్స్యగెడ్డ ప్రవాహం



లంబసింగి ప్రాంతంలో స్ట్రాబెర్రీ సాగు



లంబసింగిలో పర్యాటకుల మదిని దోచే మంచు అందాలు

ప్రకృతి ఒడిలో విరిసిన అందాల హరివిల్లు.. మన్యం. పచ్చని పరిసరాలు, ఎత్తయిన కొండలు, వంపులు తిరిగి ప్రవహించే జలపాతాలు.. ఈ ప్రదేశాలను సందర్శించిన వాళ్లంతా భూతల స్వర్గంగా అభివర్ణిస్తారు. ఇంతటి ప్రాధాన్యమున్న పర్యాటక రంగ అభివృద్ధి గత ఐదేళ్లలో పరుగులు తీసింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సందర్శనీయ ప్రాంతాలను ఆకట్టుకునేలా తీర్చిదిద్దింది. పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఉపాధి అవకాశాలు మెరుగుపడ్డాయి. ప్రస్తుత ప్రభుత్వం పాలన చేపట్టి వంద రోజులు గడుస్తున్నా పర్యాటక రంగంపై దృష్టి సారించిన సందర్భాలు లేవు.

● నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం



డుడుమ జలపాతం వద్ద భూతల స్వర్గాన్ని తలపించేలా ఆకట్టుకుంటున్న ప్రకృతి అందాలు


అడవిలో అందాలు

- ప్రకృతి ఒడిలో భూతల స్వర్గం
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే పర్యాటక రంగం అభివృద్ధి
- ప్రత్యేక నిధులతో ఆధునికీకరణ
- గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు అధిక ప్రాధాన్యం
- కొత్త ప్రాజెక్ట్‌లపై దృష్టి పెట్టని కూటమి ప్రభుత్వం

ముంచంగిపుట్టు/చింతపల్లి/అరకు టౌన్/డుంబ్రిగుడ: పర్యాటకులను రా..రమ్మని ఆహ్వానించే మన్యం అందాలను తిలకించేందుకు దేశ విదేశాల నుంచి పర్యాటకులు తరలివస్తున్నారు. తనివితీరా ఆస్వాదించి.. మరపురాని అనుభూతితో వెళ్తున్నారు. వారి అభిరుచులకు తగ్గట్టుగానే పర్యాటక ప్రాంతాలను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అభివృద్ధి చేసింది.

అరకు పద్మాపురం గార్డెన్: ఇక్కడ గత ప్రభుత్వం అత్యాధునికంగా పర్యాటకులకు అనువుగా తీర్చిదిద్దింది. రూ.48 లక్షలతో కాటేజీలు నిర్మించింది. మరో రూ.16 లక్షలతో గార్డెనింగ్, పగోడాలు, క్యాంటిన్ ఏర్పాటుచేసింది.

అరకు గిరిజన మ్యూజియం: గిరిజనుల సంప్రదాయానికి అద్దం పట్టేలా గిరిజన మ్యూజియం కూడా గత ప్రభుత్వంలోనే అభివృద్ధి చెందింది. ఇక్కడ రూ.3.60 కోట్లతో సాహస క్రీడలు, గిరిజనుల జీవనశైలి నమూనాలు, ఆడిటోరియం నిర్మించింది. ఇదే ప్రాంతంలో మరో రూ.1.40 కోట్లతో షాపింగ్ కాంప్లెక్సు నిర్మించి నిరుద్యోగ గిరి యువతకు



ఉపాధి వనరులు అందుబాటులోకి తెచ్చింది.

చాపరాయి జలవిహారి: చాపరాయి జలపాతాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఇందుకుగాను పాడేరు ఐటీడీఏ రూ.70 లక్షలు వెచ్చించింది. ఈ నిధులతో కాంపౌండ్ వాల్, పాత్‌వే, ప్రవేశద్వారం, మరుగుదొడ్లు నిర్మించింది.

అరకు పినారి: అంజోడ సిల్క్‌ఫారంను అటవీశాఖ అరకు పినారిగా ఆధునికీకరించింది. ఇక్కడ హట్స్ ఏర్పాటుచేసింది. **పర్యాటక సీజన్‌లో** సినిమాలు, **షార్ట్ ఫిల్మ్‌ల చిత్రీకరణతో సందడిగా ఉం**టుంది.

బోడకొండమ్మతల్లి వ్యూపాయింట్: చింతపల్లి మండల పరిధిలోని బోడకొండమ్మ తల్లి వ్యూపాయింట్‌ను గత అరకు ఎంపీ మాధవి తన నిధులతో అభివృద్ధి చేశారు. సుమారు రూ.40 లక్షలతో వ్యూపాయింట్‌ను ఏర్పాటుచేశారు.

చెరువులవేనం: లంబసింగిలో పాలసంద్రాన్ని తలపించే చెరువులవేనంలో పాడేరు ఐటీడీఏ రూ.26.50 లక్షలతో వ్యూపాయింట్‌ను నిర్మించింది.

స్వాతంత్య్ర సమరయోధుల గిరిజన మ్యూజియం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో రూ.35 కోట్లతో మ్యూజియం నిర్మాణం జరుగుతోంది. చరిత్రకు సాక్ష్యంగా నిలిచిపోయేలా గత ప్రభుత్వం సంకల్పించి చేపట్టింది.

సినిమా షూటింగ్‌లకు నెలవు



మత్స్యగెడ్డ ఒడ్డున సన్నివేశాలను చిత్రీకరిస్తున్న సినిమా యూనిట్

ప్రకృతి అందాలను తిలకించేందుకు ముంచంగిపుట్టు మండలంలోని డుడుమ జలాపాతానికి భారీగా పర్యాటకులు తరలి వస్తుంటారు. ఇక్కడ వంపులు తిరుగుతూ ప్రవహించే మత్స్యగెడ్డ, డుడుమ జలపాతాలు ప్రత్యేక ఆకర్షణ. సుమారు 2800 అడుగుల ఎత్తునుంచి డుడుమ జలపాతం జాలువారుతుండటంతో నీటి తుంపర్లు ఆవిరి మాదిరిగా ఈ ప్రాంతాన్ని కమ్మేస్తూ భూతల స్వర్గాన్ని తలపిస్తుంటాయి. జలవిద్యుత్ కేంద్రాలకు నీరందించే జోలాపుట్టు, డుడుమ జలాశయాలు, మాచ్‌ఖండ్ ప్రాజెక్ట్ ఇక్కడి సమీపంలోనే ఉన్నాయి. మత్స్యగెడ్డ పరిసర ప్రాంతాల్లో ఇట్లు మారేడుమిల్లి ప్రజానీకం, హనుమాన్ తదితర చిత్రాల్లో సన్నివేశాలు చిత్రీకరించారు.



చెరకు రైతు, కార్మికుల బకాయిలు తక్షణం చెల్లించండి

- ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం డిమాండ్

చోడవరం రూరల్: మండలంలోని గోవాడలో చోడవరం సహకార చక్కెర కర్మాగారం చెరకు రైతులకు, కార్మికులకు బకాయిలను తక్షణం చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం డిమాండ్ చేసింది. పట్టణంలో సంఘం జిల్లా కమిటీ సమావేశం గురువారం జరిగింది. జిల్లా కార్యదర్శి కోన మోహన్‌రావు మాట్లాడుతూ కొన్నేళ్ల పాటు ఐదు లక్షల మెట్రిక్ టన్నుల మేరకు చెరకు గానుగాడి పంచదార ఉత్పత్తులు, లాభాలతో రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలిచిన చోడవరం సుగర్ ఫ్యాక్టరీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రైతు వ్యతిరేక నిర్ణయాల కారణంగా నష్టాల పాలయ్యిందని దుయ్యబట్టారు. లాభాలతో నడిచిన కాలంలో అధికార పార్టీ నాయకులు, పాలకవర్గాలు, అధికార యం



మాట్లాడుతున్న సంఘం ప్రతినిధులు

త్రాంగం కుమ్మక్కై వారి అవినీతి అక్రమాలకు ఫ్యాక్టరీని అక్షయపాత్రగా మార్చుకున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ప్రస్తుతం సహకార రంగంలో నష్టాలతో కొట్టుమిట్టాడుతూ ఈ ఫ్యాక్టరీ మాత్రమే మిగిలి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు సరైన మద్దతు ధర లేకపోవడం, ఇచ్చే అరకొర చెల్లింపులను మరో సీజన్ మొదలయ్యేవరకు ఇవ్వకపోవడం వంటి పోకడల కారణంగా గత సీజన్‌లో కేవలం లక్షా 70 వేల టన్నుల చెరకు క్రషింగ్ చేయడానికే ఆపసోపాలు పడాల్సిన దుస్థితి నెలకొనడం విచారకరమన్నారు. ఫ్యాక్టరీపై ఆధారపడిన 24,500 మంది చెరకు రైతులు, వెయ్యి వరకు ఉన్న కార్మిక సిబ్బందిని ప్రభుత్వాలు ఆదుకోవలసిన బాధ్యత ఉందన్నారు. ఎన్నికల ముందు రాజకీయ పార్టీల హామీలు అనంతరం గాలిలో కలిసిపోయే పరిస్థితి మారాలని కోరారు. రైతు, కార్మిక శ్రేయస్సు కోసం జిల్లా ఎంపీ, ఎమ్మెల్యేలు రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని సూచించారు. రైతుల బకాయిలు, మృతి చెందిన రైతు కుటుంబాలకు చెల్లించాల్సిన ఇన్సూరెన్సు బకాయి రూ.9 కోట్లు, కార్మికుల వేతన బకాయి రూ.3 కోట్లు తక్షణం చెల్లించేలా ప్రభుత్వాన్ని కోరాలన్నారు. రానున్న సీజన్‌లో టన్ను చెరకునకు నాలుగు వేల రూపాయలు మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. పరికరాల కొనుగోళ్లు, ఫ్యాక్టరీ ఉత్పత్తుల అమ్మకాలలో చోటుచేసుకున్న అవినీతిని వెలికితీసి, బాధ్యులపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో సంఘం జిల్లా కమిటీ ప్రతినిధులు బేరా జగదీశ్వరరావు, అయితిరెడ్డి అప్పలనాయుడు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి మహిళా కబడ్డీ విజేత విజయనగరం



ఫైనల్‌లో పోటీ పడిన విశాఖ, విజయనగరం జిల్లా జట్లతో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్

- ద్వితీయ స్థానం దక్కించుకున్న విశాఖ
- విజేతలకు బహుమతులు అందజేసిన వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్

మునగపాక: రాష్ట్ర స్థాయి మహిళా కబడ్డీ పోటీల్లో విజేతగా విజయనగరం జట్టు నిలిచింది. మరిడిమాంబ అమ్మవారి పండుగ సందర్భంగా మునగపాకలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఈ పోటీలు గురువారం రాత్రితో ముగిశాయి. స్థానిక నందీశ్వర కళా ప్రాంగణంలో విజేతలకు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ బహుమతులు అందజేశారు. ఫైనల్‌లో విజయనగరం, విశాఖ జట్ల మధ్య పోటీ రసవత్తరంగా సాగింది. ఈ పోటీల్లో విజయనగరం జట్టు విజేతగా నిలిచింది. విశాఖ జట్టు ద్వితీయ, గుంటూరు జట్టు తృతీయ, శ్రీకాకుళం జట్టు చతుర్థ స్థానాల్లో నిలిచాయి. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో కబడ్డీకి ఎంతో ఆదరణ ఉందన్నారు. రాష్ట్ర స్థాయిలో మహిళా కబడ్డీ పోటీలను ఏర్పాటు చేసిన నిర్వాహకులను అభినందించారు. కబడ్డీ



ఫైనల్‌లో తలపడుతున్న విశాఖ-విజయనగరం జట్లు

అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వి.శ్రీనివాసరావు నేతృత్వంలో నిర్వహించిన పోటీల్లో 8 జిల్లాలకు చెందిన క్రీడాకారులు హాజరయ్యారు. పోటీలను తిలకించేందుకు క్రీడాభిమానులు భారీగా తరలివచ్చారు. పోటీలకు రిఫరీలుగా గణపతిరావు, కాళీ ప్రసాద్, నిరుపమ, యామిని పద్మ,ఇ.శివ, నానాజీ వ్యవహరించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ వేగి కృష్ణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, మాజీ ఎంపీపీ దాసరి అప్పారావు, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు టెక్కలి పరశురామ్, సర్పంచ్ దిమ్మల అప్పారావు, మూలపేట సర్పంచ్ గంగప్పలనాయుడు, హరిపాలెం సర్పంచ్ మారిశెట్టి సూర్యనారాయణ పాల్గొన్నారు.

కొత్తపెంటలో పిడుగుపాటుకు రైతు మృతి

- పొలంలో గడ్డి కోసి వస్తుండగా ప్రమాదం



మృతి చెందిన సూరెడ్డి అప్పలనాయుడు

దేవరాపల్లి: మండలంలోని కొత్తపెంటలో పిడుగుపాటుకు గురై రైతు సూరెడ్డి అప్పలనాయుడు (36) గురువారం మృతి చెందాడు. ఉదయం పొలంలో గడ్డి కోసి, మోపు తీసుకొని వస్తుండగా భారీ శబ్దంతో కూడిన పిడుగు ఒక్కసారిగా అతడిపై పడింది. దీంతో రైతు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య కుమారి, ఏడేళ్ల కుమారుడు వరుణ్ ఉన్నారు. పశువులకు గడ్డి కోసం వెళ్లిన తన భర్త ఆకస్మిక మరణించడంతో భార్య, ఇతర కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఇంటికి పెద్ద దిక్కుగా నిలిచిన తన భర్త మృత్యువాత పడటంతో తమకు దిక్కెవరంటూ భార్య గుండెలవిసేలా రోదించిన తీరు పలువుర్ని కంటతడి పెట్టించింది. అందరితో కలిసి మెలిసి ఉండే అప్పలనాయుడు మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. దేవరాపల్లి ఎస్ఐ టి. మల్లేశ్వరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు

గొలుగొండ: మండలంలో కృష్ణదేవిపేట నుంచి అక్రమంగా ఏడు మద్యం సీసాలు తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ దివ్య తెలిపారు. చోద్యం గ్రామానికి చెందిన రమణ కృష్ణదేవిపేట నుంచి ఆబెల్టుషాపునకు మద్యం సీసాలు తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. కేసు నమోదు చేశామన్నారు. గ్రామాల్లో మద్యం, సారా అమ్మకాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తాండవలో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం



శివమోహన్ మృతదేహం

పాయకరావుపేట: తాండవ నదిలో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మండలంలో సత్యవరం గ్రామానికి చెందిన ఏనుగు శివమోహన్ బుధవారం తాండవలో గల్లంతైన విషయం తెలిసిందే. గురువారం స్థానిక పోలీసుల బృందం వచ్చి గాలించగా, మృతదేహం లభ్యమైనట్లు సీఐ జి.ఎస్.అప్పన్న తెలిపారు. మృతదేహాన్ని నక్కపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించామన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

8 మంది పేకాటరాయుళ్ల అరెస్టు



నిందితులతో ఎస్ఐ భీమరాజు, సిబ్బంది

- రూ. 8,500 స్వాధీనం

నాతవరం: మండలంలో పి.జగ్గంపేట గ్రామంలో పేకాట స్థావరంపై దాడులు చేశామని ఎస్ఐ సిహెచ్.భీమరాజు గురువారం తెలిపారు. సమాచారం మేరకు సిబ్బందితో దాడులు చేశామన్నారు. ఈ దాడిలో పేకాడుతున్న ఎనిమిది మందిని పట్టుకున్నామన్నారు. వారి నుంచి రూ.8.500 స్వాధీనం చేసుకున్నామన్నారు. పట్టుకున్న వారిని పోలీసు స్టేషన్‌కు తీసుకువచ్చి కేసు నమోదు చేశామన్నారు. పండగలు సందర్భంగా పేకాటలు, అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించడం చట్టరీత్యా నేరమన్నారు.


78 కిలోల గంజాయి పట్టివేత



బత్తివానిపాలెం కూడలి వద్ద కారులో తరలిస్తున్న గంజాయి, నిందితులతో పోలీసులు

కె.కోటపాడు : మండలంలో బత్తివానిపాలెం కూడలి మీదుగా కారులో తరలిస్తున్న 78 కిలోల గంజాయిని కె.కోటపాడు పోలీసులు బుధవారం రాత్రి పట్టుకున్నారు. ఎస్ఐ ఆర్.ధనుంజయ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బత్తివానిపాలెం కూడలి వద్ద అటు వైపుగా వెళ్తున్న కారును పోలీసులు ఆపి తనిఖీలు చేశారు. కారు వెనక భాగంలో 78 కిలోల గంజాయి మూటలుగా ఉండడాన్ని ఎస్ఐ గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. కారులో గంజాయిని తరలిసున్న ఛత్తీస్‌గఢ్‌కు చెందిన దేవానంద్ గోయధర్, ఒడిశాకు చెందిన మహిళ సుప్రీ మండల్‌ను అదుపులోకి తీసుకుని, గురువారం కేసు నమోదు చేశారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు. గంజాయితో పాటు కారును సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.4 లక్షలు ఉంటుందన్నారు.

సచివాలయ సిబ్బంది గైర్హాజరుపై గ్రామస్తుల ఆందోళన



సచివాలయం వద్ద ఆందోళన వ్యక్తం చేస్తున్న యువకులు

బుచ్చెయ్యపేట : కొమళ్లపూడి సచివాలయం సిబ్బంది విధులకు సక్రమంగా హాజరు కాకపోవడంపై గ్రామస్తులు గురువారం ఆందోళనకు దిగారు. పంచాయతీ కార్యదర్శి ఈశ్వరరావు, సచివాలయ కార్యదర్శి అరుణ, అగ్రికల్చరల్ అసిస్టెంట్ నాగేశ్వరరావుతో పాటు పలువురు ఉద్యోగులు సచివాలయానికి రావడం లేదని, కోఆపరేటివ్ మాజీ అధ్యక్షుడు మోటూరి చిన్నంనాయుడు, గ్రామస్తులు యన్నెంశెట్టి సన్యాసిరావు, మోటూరి బాలాజీ, పెంటకోట ప్రసాద్, గండెం చిన్నారావు, మేకల సతీష్ ఆరోపించారు. ఇటీవల సిబ్బందిని నిలదీయగా నెట్ రావడం లేదని, అందుకే వేరే దగ్గర విధులు నిర్వహిస్తున్నామని తెలిపారని, దీంతో తాము సొంత డబ్బులతో 10 రోజుల క్రిందట నెట్ సదుపాయం కల్పించామని మాజీ కోఆపరేటివ్ అధ్యక్షుడు చిన్నంనాయుడు తెలిపారు. గురువారం ఉదయం 11 గంటలైనా సిబ్బంది రాకపోవడంతో సచివాలయం ఎదుట గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. సిబ్బంది తీరు మార్చుకోకపోతే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

15 దేశాలు.. 160 పరిశోధన పత్రాలు

సెంచూరియన్ వర్సిటీలో అంతర్జాతీయ సమావేశం

పర్లాకిమిడి: ఒడిశాలోని పర్లాకిమిడి సమీపంలోని ఆర్.సీతాపురంలో సెంచూరియన్ వర్సిటీ క్యాంపస్‌లో గురువారం వికసిత్ భారత్, వినూత్న వ్యాపారం, వ్యవసాయం, టెక్నాలజీ, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై వనరుల నిర్వాహణపై అంతర్జాతీయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ బినోద్ ఆత్రేయ (నేపాల్), ఓఆర్ఎస్ఐ. (భువనేశ్వర్) డాక్టర్ రబినారాయణ సుబుద్ధి, ప్రొఫెసర్ మోనీ మడస్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈ అంశాలపై దేశ విదేశాలకు చెందిన నిష్ణాతులు కూలంకషంగా మాట్లాడారు. రెండురోజుల ఈ సదస్సుకు సెంచూరియన్ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ సుప్రియా పట్నాయక్ అధ్యక్షత వహించారు. సదస్సులో 15 దేశాల నుంచి 160 పరిశోధన పేపర్లు అందినట్లు డాక్టర్ రబినారాయణ సుబుద్ధి తెలిపారు. సదస్సులో ఎం.ఎస్.స్వామినాథన్ వ్యవసాయ విద్యాలయం విద్యార్థుల ప్రదర్శన ఆకట్టుకుంది.



వర్సిటీలో వికసిత్ భారత్ వాటి లక్ష్యాలు, అబ్‌స్ట్రాక్ట్ సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న ముఖ్యఅతిథులు

పండగల వేళ పలు రైళ్లకు అదనపు కోచ్‌లు

తాటిచెట్లపాలెం: దసరా, దీపావళి వంటి పండగల సందర్భంగా పలు రైళ్లకు తాత్కాలికంగా కోచ్‌లను జతచేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. ● భువనేశ్వర్-కేఎస్ఆర్ బెంగళూరు(18463)ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌కు అక్టోబరు 2, 11వ తేదీల్లో, కేఎస్ఆర్ బెంగళూరు-భువనేశ్వర్(18464) ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌కు అక్టోబరు 3, 12వ తేదీల్లో ఒక స్లీపర్ కోచ్ ● భువనేశ్వర్-తిరుపతి(22871) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు అక్టోబరు 6 నుంచి నవంబరు 10వ తేదీ వరకు, తిరుపతి-భువనేశ్వర్(22872) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు అక్టోబరు 7 నుంచి నవంబరు 11వ తేదీ వరకు (రైలు నడిచే రోజుల్లో) జనరల్ సెకండ్ సిట్టింగ్ కోచ్ ● భువనేశ్వర్-పుణే (22882) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు అక్టోబరు 1 నుంచి నవంబరు 5వ తేదీ వరకు, పుణే-భువనేశ్వర్(22881) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు అక్టోబరు 3 నుంచి నవంబరు 7వ తేదీ వరకు జనరల్ సెకండ్ సిట్టింగ్ కోచ్ ● సంబల్‌పూర్-నాందేడ్ (20809) నాగావళి ఎక్స్‌ప్రెస్‌కు అక్టోబరు 4 నుంచి 28వ తేదీ వరకు, నాందేడ్-సంబల్‌పూర్ (20810) నాగావళి ఎక్స్‌ప్రెస్‌కు అక్టోబరు 5 నుంచి 29వ తేదీ వరకు ఒక థర్డ్ ఏసీ, ఒక స్లీపర్ క్లాస్ కోచ్ ● సంబల్‌పూర్-ఈరోడ్ (08311) స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌కు అక్టోబరు 2 నుంచి 30వ తేదీ వరకు, ఈరోడ్-సంబల్‌పూర్ (08312) స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌కు అక్టోబరు 4 నుంచి నవంబరు 1వ తేదీ వరకు ఒక థర్డ్ ఏసీ, ఒక స్లీపర్ క్లాస్ కోచ్ ● విశాఖ-కిరండూల్-విశాఖ(08551 /08552) పాసింజర్ స్పెషల్‌కు అక్టోబరు 1 నుంచి 31వ తేదీ వరకు ఒక స్లీపర్ క్లాస్ కోచ్ ● విశాఖ-గుణుపూర్-విశాఖ (08522/08521) పాసింజర్ స్పెషల్‌కు అక్టోబరు 1 నుంచి 31వ తేదీ వరకు ఒక స్లీపర్ క్లాస్ కోచ్ ● భువనేశ్వర్-ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ (12830) ఎక్స్‌ప్రెస్‌కు అక్టోబరు 3 నుంచి నవంబరు 14వ తేదీ వరకు, ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ - భువనేశ్వర్ (12829) ఎక్స్‌ప్రెస్‌కు అక్టోబరు 4 నుంచి నవంబరు 15వ తేదీ వరకు ఒక జనరల్ సెకండ్ సిట్టింగ్ కోచ్ ● భువనేశ్వర్-ఎస్ఎంవీటి బెంగళూరు (12845) ఎక్స్‌ప్రెస్‌కు అక్టోబరు 6 నుంచి నవంబరు 17వ తేదీ వరకు, ఎస్ఎంవీటి బెంగళూరు-భువనేశ్వర్(12846) ఎక్స్‌ప్రెస్‌కు అక్టోబరు 7 నుంచి నవంబరు 18వ తేదీ వరకు ఒక జనరల్ సెకండ్ సిట్టింగ్ కోచ్ ● భువనేశ్వర్-పుదుచ్చేరి (12898) ఎక్స్‌ప్రెస్‌కు అక్టోబరు 1 నుంచి నవంబరు 12వ తేదీ వరకు, పుదుచ్చేరి-భువనేశ్వర్(12846) ఎక్స్‌ప్రెస్‌కు అక్టోబరు 2 నుంచి నవంబరు 13వ తేదీ వరకు ఒక జనరల్ సెకండ్ సిట్టింగ్ కోచ్ ● భువనేశ్వర్-రామేశ్వరం (20896) ఎక్స్‌ప్రెస్‌కు అక్టోబరు 4 నుంచి నవంబరు 15వ తేదీ వరకు, రామేశ్వరం-భువనేశ్వర్(20895) ఎక్స్‌ప్రెస్‌కు అక్టోబరు 6 నుంచి నవంబరు 17వ తేదీ వరకు జనరల్ సెకండ్ సిట్టింగ్ కోచ్ జత చేస్తున్నారు.

క్లుప్తంగా

18.6 మి.మీ వర్షపాతం



ఎన్టీఆర్ క్రీడా మైదానం రహదారిలో కురుస్తున్న వర్షం

అనకాపల్లి: వర్షాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరీ చెప్పారు. గురువారం పట్టణ పరిధిలో 18.6 మి.మీ వర్షపాతం నమోదైనట్లు పేర్కొన్నారు. మరో రెండు రోజులు పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.

లాభాల్లో కశింకోట పీఏసీఎస్



మాట్లాడుతున్న పర్సన్ ఇన్‌చార్జి రాజేష్‌కుమార్

కశింకోట: స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్) లాభాల్లో నడుస్తుందని సంఘ పర్సన్ ఇన్‌చార్జి బి.రాజేష్‌కుమార్ తెలిపారు. సంఘ భవనం వద్ద గురువారం సంఘ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.14.02 లక్షల లాభాన్ని ఆర్జించిందన్నారు. సంఘ సీఈవో ద్వారపు రెడ్డి నూకేశ్వరరావు సంఘ పరిపాలన నివేదిక సమర్పించగా సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. గడిచిన ఏడాది వాస్తవ బడ్జెట్, ఈ ఏడాది అంచనా బడ్జెట్‌ను ఆమోదించింది. సంఘంలో ఎరువుల అమ్మకం జరుగుతుందని, సంఘం కంప్యూటరీకరణ జరుగుతున్నందున సభ్యులంతా కేవైసీ వివరాలు సమర్పించాలని సూచించారు. సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలకు ఫ్యాన్ల వితరణ

పెందుర్తి: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు పెందుర్తి కెమిస్ట్స్, డ్రగ్గిస్ట్స్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు ఫ్యాన్లు సమకూర్చారు. గురువారం కళాశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.చంద్రశేఖర్‌కు సొసైటీ ప్రతినిధులు 5 ఫ్యాన్లు అందించారు. కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు జి.సత్య గణపతిరావు, ఆర్.ఎస్.శేఖర్‌బాబు, జి.భాస్కర్, జి.మురళి, డి.బి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు గురువారం 119 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,390	4,980
రెండో రకం	3,610	3,810
మూడోరకం	3,220	3,300

అనకాపల్లి సినిమాలు

దేవర : రాజా
దేవర : సత్యనారాయణ స్క్రీన్-1
మత్తు వదలరా 2
:సత్యనారాయణ స్క్రీన్-2
దేవర :పర్తిసాయి
సరిపోదా శనివారం :షిర్డీసాయి
దేవర : వెంకటేశ్వర
మన్యం ధీరుడు సీతారామరాజు : శ్రీసత్య
దేవర :రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 39 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-4 యూనిట్, బీ పాజిటివ్-20 యూనిట్లు, ఓ పాజిటివ్-12 యూనిట్లు, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 387 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 289 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.

పీజీ వైద్య విద్య గగనమే..!

కూటమి ప్రభుత్వం గ్రామీణ, గిరిజన వైద్యులకు ఉన్నత వైద్యను దూరం చేస్తోంది. పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, యూసీహెచ్‌సీల్లో పని చేస్తున్న వీరికి గత ప్రభుత్వం తీసుకొచ్చిన పీజీ వైద్య రిజర్వేషన్‌లో కోత వేసింది. కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ పీజీ వైద్య సీట్లు ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేసేలా జీవో 85 తీసుకొచ్చింది. దీనిని వ్యతిరేకిస్తూ వైద్యులు ఆందోళనలు చేస్తున్నారు.

- కార్పొరేట్ శక్తులకు మేలు చేస్తూ జీవో 85 విడుదల
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కల్పించిన రిజర్వేషన్‌లో కోత
- కూటమి ప్రభుత్వంపై వైద్యుల ఆగ్రహం
- పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, యూసీహెచ్‌సీల్లో నిలిచిన సేవలు



ఎన్టీఆర్ వైద్యాలయం వద్ద ధర్నా చేస్తున్న పీహెచ్‌సీ వైద్యులు



తుమ్మపాల పీహెచ్‌సీ

అనకాపల్లి: పీహెచ్‌సీ, సీహెచ్‌సీ వైద్యులకు ఇన్ సర్వీస్ కోటా కింద పీజీ విద్యలో కల్పించిన రిజర్వేషన్‌ను కూటమి ప్రభుత్వం కుదించింది. దశాబ్దాలుగా గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో పని చేయడానికి వైద్యులు విముఖత చూపుతున్నారు. దాంతో రోగులకు నాణ్యమైన వైద్య సేవలందడం లేదు. ఈ పరిస్థితిని గమనించిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పీజీ విద్యలో రిజర్వేషన్ కల్పిస్తూ గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో పనిచేసేలా ప్రోత్సహించింది. దీనికి విరుద్ధంగా చంద్రబాబు అధికారంలోకి రాగానే కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ జీవో 85 విడుదల చేశారు. దీనిని నిరసిస్తూ పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, యూసీహెచ్‌సీ వైద్యులు రోడ్డెక్కారు. ఈ నెల 12 నుంచి దశలు వారీగా ఉద్యమాలు చేస్తున్నారు. దాంతో పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, యూసీహెచ్‌సీల్లో అత్యవసర సేవలు మినహా మిగతా సేవలకు దూరంగా ఉంటున్నారు.

గత ప్రభుత్వం మేలు చేస్తే... ఇప్పుడు కోత

పీహెచ్‌సీ, సీహెచ్‌సీలో మూడేళ్ల పాటు వైద్య సేవలందిస్తే... నీట్ పీజీ విద్యలో క్లినికల్ సీట్లలో రిజర్వేషన్‌ను 30 శాతానికి, నాన్ క్లినికల్ సీట్లలో 50 శాతానికి కల్పిస్తూ 2021లో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. దానిలో కోత విధిస్తూ కూటమి ప్రభుత్వం కొత్తగా జీవో నంబర్ 85 తీసుకువచ్చి 30 శాతాన్ని 15 శాతానికి కుదించింది. పీహెచ్‌సీ, సీహెచ్‌సీలో ఐదేళ్లపాటు వైద్య సేవలందించాలని నిబంధన విధించింది. దీంతో గ్రామీణ, గిరిజన ప్రాంత వైద్యులు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఇది కూడా పీజీ కౌన్సెలింగ్‌లో జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, పీడీయాట్రిక్స్, ఎనస్తీషియా, ఓపీ గైనకాలజీ వంటి ఆరు బ్రాంచ్‌లకు మాత్రమే కల్పించింది. క్లినికల్స్, నాన్ క్లినికల్‌లో 19 బ్రాంచ్‌లు ఉండగా, 6 బ్రాంచ్‌లకు రిజర్వేషన్ వర్తించేలా జీవో ఇవ్వడంతో వైద్యులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

డిమాండ్లు ఇవే...

- గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న వైద్యులకు ప్రమోషన్లు కల్పించడం లేదు. దాంతో ఒకే పోస్టులో పదవీ విరమణ చేసే పరిస్థితి ఏర్పడింది. వీరికి న్యాయం చేయాలి.
- టైమ్ బ్యాండ్ ప్రమోషన్లు 6, 12, 18 సంవత్సరాలు ఒకే పోస్టులో కాకుండా సీనియారిటీ ప్రకారం కల్పించాలి.
- గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్న వైద్యులకు ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ (ఏపీవీపీ)లో పనిచేస్తున్న వైద్యులు మాదిరిగా 50 శాతం జీతం పెంచాలి.

ప్రమోషన్లు కల్పించాలి



గ్రామీణ ప్రాంతాల్లో పెరుగుతున్న జనాభాకు తగ్గట్టుగా వైద్యులను పెంచాలి. 1975, 76 సంవత్సరంలో ఏర్పాటైన పీహెచ్‌సీలో ప్రమోషన్లు లేక ఇప్పటికీ సివిల్ అసిస్టెంట్ సర్జన్లుగా ఉండిపోయారు. ఇతర వైద్య విభాగాల్లో ప్రమోషన్లు ఉండగా, మాకు మాత్రం కల్పించడం లేదు. – ఎస్.తిరుపతిరావు, ఏపీ పీహెచ్‌సీ వైద్యుల అసోసియేషన్ జిల్లా కార్యదర్శి

ప్రభుత్వానికి ఎందుకంత కక్ష



మారుతున్న కాలానికి, వ్యాధులు బారిన పడుతున్న రోగులను దృష్టిలో పెట్టుకుని కూటమి ప్రభుత్వం రిజర్వేషన్ పెంచాల్సింది పోయి తగ్గించడం దారుణం. పీహెచ్‌సీలో విధులు నిర్వహిస్తున్న ఏఎన్‌ఎంలు, సూపర్ వైజర్లకు సీనియారిటీ ప్రకారం ప్రమోషన్లు వస్తున్నాయి. వైద్యులకు లేకపోవడం బాధాకరం.
– ఎస్తేర్ రాణి, అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు

జీవో 85 రద్దు చేయాలి



రోగులకు ప్రశాంతమైన వాతావరణంలో వైద్యం అందిస్తున్నాం. కూటమి ప్రభుత్వం మాకు ఏమి ఇవ్వకపోయినా పర్వాలేదు. ఉన్న సీట్లను తగ్గించడంతో సమస్య మరింత ఎక్కువగా ఏర్పడుతుంది. జీవో 85ను తక్షణమే రద్దు చేయాలి.
– డాక్టర్, వెంకటేష్, తాళ్లపాలెం పీహెచ్‌సీ వైద్యుడు, కశింకోట

నేడు ఉచిత కుట్టు మిషన్ శిక్షణ ప్రారంభం

అనకాపల్లి: స్థానిక న్యూకాలనీ రోటరీ మెమోరీయల్ ఫంక్షన్ హాల్లో శుక్రవారం ఉదయం 10 గంటలకు నిరుద్యోగ మహిళలకు ఉచిత కుట్టు మిషన్ శిక్షణ ప్రారంభిస్తున్నట్లు క్లబ్ అనకాపల్లి అధ్యక్షుడు సరిసా రాజేష్, కార్యదర్శి దేవర అనిల్, ప్రతినిధి కడిమిశెట్టి సతీష్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రోటరీ క్లబ్ (కోల్ ఇండియా సీఎస్ఆర్ నిధుల సహాయంతో) ఆధ్వర్యంలో ఈ నెల 27 నుంచి 14 రోజుల పాటు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ అనంతరం ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ చేస్తామన్నారు.

జూనియర్ ఎన్టీఆర్ అభిమానుల బైక్ ర్యాలీ



ఎన్టీఆర్ చిత్రపటంతో అభిమానుల బైక్ ర్యాలీ

తుమ్మపాల: జూనియర్ ఎన్టీఆర్ నటించిన దేవర చిత్రం శుక్రవారం విడుదల కానున్న సందర్భంగా ఆయన అభిమానులు భారీ బైక్ ర్యాలీ చేపట్టారు. పట్టణంలోని పలు వీధుల్లో ఎన్టీఆర్ చిత్రపటాన్ని ఊరేగిస్తూ భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. దేవర సినిమా ఘన విజయం సాధించాలంటూ కేరింతలు చేశారు. వివిధ సాంస్కృత కార్యక్రమాలతో నిర్వహించిన ర్యాలీలో పట్టణ బాలకృష్ణ, జూనియర్ ఎన్టీఆర్ సంఘాల గౌరవ అధ్యక్షుడు పోలవరం నాయుడు, అధ్యక్షుడు మల్ల సంతోష్, శ్రీలలిత జ్యువెలరీ అధినేత దాడి గణేష్, భీమేష్, సురేష్, గిరీష్, శ్యామ్ కుమార్, కరణం మోహన్, సూరిశెట్టి ప్రదీప్, బొడ్డేడ సాయి, పాలిమేర అరవింద్ పాల్గొన్నారు.

‘శారదా వనం’ ప్రారంభోత్సవం నేడు



క్యాంటీన్ షెడ్



ఎడ్యుకేషన్ సెంటర్ షెడ్



వనంలో ప్రారంభోత్సవానికి ఏర్పాటు చేసిన శిలా ఫలకం



బయ్యవరంలో ప్రారంభోత్సవానికి సిద్ధమైన శారదా వనం

కశింకోట: మండలంలో బయ్యవరం వద్ద రిజర్వు ఫారెస్టులో అటవీ శాఖ ఆధ్వర్యాన నూతనంగా నిర్మించిన ‘శారదా వనం’ శుక్రవారం ప్రారంభోత్సవానికి అధికారులు సన్నాహాలు చేశారు. దీన్ని ఉదయం 10 గంటలకు విశాఖ సర్కిల్ ఫారెస్టు చీఫ్ కన్జర్వేటర్ శ్రీకంఠనాథరెడ్డి ప్రారంభించనున్నట్లు అనకాపల్లి ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ పి. జ్యోతిర్మయి గురువారం తెలిపారు. జిల్లా ఫారెస్టు అధికారి ఆర్. జగన్నాథ్‌సింగ్, సబ్ డివిజనల్ ఫారెస్టు అధికారి ఎ. సునీల్‌కుమార్ తదితరులు హాజరవుతారన్నారు. ఈ పార్కును దశల వారీ అభివృద్ధి చేయడంలో భాగంగా మొదటి దశలో రూ.1.40 కోట్లతో పది హెక్టార్ల విస్తీర్ణంలో నిర్మిస్తున్నామన్నారు. రెండో దశలో రూ.60 లక్షలు ఖర్చు చేయాలని యోచిస్తున్నామన్నారు. జిల్లా ప్రధాన కేంద్రం అనకాపల్లి మీదుగా ప్రవహిస్తున్న శారదా నది పాశస్త్యాన్ని దృష్టిలో పెట్టుకొని నది పేరు పెట్టి వనాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. అడవుల ప్రాముఖ్యతను ప్రజలకు, విద్యార్థులకు తెలియజేయడానికి దీని నిర్మాణం ఇక్కడ చేపట్టామన్నారు. దీనిలో రూ.20 నామమాత్రపు ప్రవేశ రుసుంతో అందరికి ప్రవేశం కల్పిస్తామన్నారు. దీనిలో సందర్శకులు వేచి ఉండటానికి పకోడాలు, అడవులు, చెట్ల ప్రాముఖ్యతను వివరించే ఎడ్యుకేషన్ సెంటర్, తినుబండారాల కోసం క్యాంటీన్ సదుపాయం ఏర్పాటు చేశామన్నారు. వనంలో అందమైన లోకేషన్లలో ఫొటోలు తీసుకోవడానికి డెక్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. రోజ్ వుడ్, ఎర్ర చందనం, టేకు, వెదురు తదితర జాతుల మొక్కలు, గడ్డి పెంపకం, ఔషధ మొక్కల పెంపకం చేపట్టామని, వాటిపై అవగాహన కల్పిస్తామన్నారు. వాకింగ్ ట్రాక్ కూడా ఏర్పాటు చేశామన్నారు. వనంలో ప్రకృతి సౌందర్యం సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటుందన్నారు. వర్షాలు కారణంగా పనులు పూర్తిస్థాయిలో జరగలేదని, ప్రారంభోత్సవం అనంతరం వాటిని పూర్తి చేసి ప్రజలకు త్వరలోనే పూర్తి స్థాయిలో అందుబాటులోకి తేవడానికి చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.



మాట్లాడుతున్న రేంజ్ ఆఫీసర్ జ్యోతిర్మయి

పరిశుభ్రమైన ఆహారంతో ఆరోగ్యం

ఎన్టీఆర్ వైద్యాలయం ఆయుష్ విభాగం వైద్యురాలు లావణ్య



విద్యార్థులకు ఆయుర్వేదంపై అవగాహన కల్పిస్తున్న వైద్యురాలు లావణ్య

అనకాపల్లి: పరిశుభ్రమైన ఆహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా జీవించవచ్చని ఎన్టీఆర్ వైద్యాలయం ఆయుష్ విభాగం వైద్యురాలు కె.లావణ్య అన్నారు. గురువారం స్థానిక భీమునిగుమ్మం జీవీఎంసీ హైస్కూల్‌లో విద్యార్థులకు ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించారు. అనంతరం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకోవాలని, అధిక బరువు వల్ల మహిళలకు పీసీవోడీ సమస్య ఉంటుందని, నిత్యం యోగా చేయడంతో ఆరోగ్యంగా జీవించవచ్చని సూచించారు. రహదారులపై ఫాస్ట్‌ఫుడ్ తీసుకోవడం వల్ల వ్యాధుల బారినపడే అవకాశాలు ఉన్నాయన్నారు. వివిధ రకాల వ్యాధులకు ఆయుర్వేదంలో అనేక మందులు ఉన్నాయన్నారు. రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఆయుష్ విభాగం యోగా శిక్షకురాలు ఎం.చంద్రిక, ఉపాధ్యాయుడు బాషా పాల్గొన్నారు.

ఘనంగా దుర్గమాంబ ఉత్సవం



గజమాల అలంకరణలో దుర్గమాంబకు పూజలు



ఆలయంలో సన్నాయి మేళతాళాలు

కశింకోట: గవరపేటలో వెలసిన దుర్గమాంబ ఉత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని గజమాల వేసి సన్నాయి మేళతాళాలతో పురోహితుని వేదమంత్రాలతో ఉత్సవ కమిటీ చైర్మన్, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించారు. అమ్మవారిని నూతన వస్త్రాలు, ఆభరణాలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని చీరలు, రవికెలు, అరటి గెలలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రికి మహిళలు కోలాటాలు ప్రదర్శించారు. సంతబయల దుర్గమాంబ ముఖద్వారం నుంచి ఆలయం వరకు విద్యుద్దీపాలంకరణ ఏర్పాటు చేశారు. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు.

ఘనంగా అమృతానంద సరస్వతి జయంతి



దేవీపురంలోని యాగశాలలో యంత్ర పూజలు నిర్వహిస్తున్న భక్తులు

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం దేవీపురంలోని రాజరాజేశ్వరీదేవి ఆరాధన పీఠంలో దేవీపురం వ్యవస్థాపకులు అమృతానంద సరస్వతీ 90వ జయంతిని పురస్కరించుకుని గురువారం విశేష కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం నుంచి గణపతి, బాల, వారాహి, లలిత జప, తర్పణ, యంత్ర పూజలను భక్తిశ్రద్ధలతో జరిపారు. గురుకటాక్షం పొందేందుకు దేశ విదేశాల నుంచి పలువురు శిష్యులు తరలివచ్చారు. మధ్యాహ్నం శిష్యులందరిచేత సామూహిక అమృత జయంతి హోమం నిర్వహించారు. అనంతరం గురుపాదుకా పల్లకీ సేవ, గురుపాద పూజ చేశారు. 2024–25 విద్యా సంవత్సరానికి 15 మంది బాలికలతో నిర్వహించే అమృత కన్యా గురుకులం ప్రాంగణాన్ని గురుమాత అన్నపూర్ణమ్మ చేతుల మీదుగా ప్రారంభించారు. సాయంత్రం పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

చిరుధాన్యాల సాగుకు సహకారం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వ్యవసాయాధికారి దుర్గాప్రసాద్, ప్రకృతి ఫల సంఘం ప్రతినిధులు

పెందుర్తి: ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో వరి కంటే చిరు ధాన్యాల సాగు మేలని ఏవో టి.దుర్గాప్రసాద్ అన్నారు. చిరుధాన్యాల సాగుకు రైతులకు పూర్తిస్థాయిలో సహకారం అందిస్తామన్నారు. మండలంలోని పినగాడిలో గురువారం నిర్వహించిన ప్రకృతి ఫల రైతు ఉత్పత్తిదారుల సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. చిరు ధాన్యాల వినియోగం పెరిగినందున తక్కువ వ్యయంతో అధిక ఆదాయం వచ్చే పంటలపై రైతులు దృష్టి సారించాలన్నారు. ప్రకృతి ఫల క్యాలెండర్, పోస్టర్‌ను ఆవిష్కరించారు. జాగృతి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కందర్ప సుజాత, సంఘం చైర్మన్ వెన్నెల పెంటబాబు, సీఈవో ఎస్.ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో కార్మికుడి మృతి

పరవాడ: ఫార్మాసిటీలో కూలి పనులు చేసుకుంటూ లంకెలపాలెంలో నివాసం ఉంటున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన విశ్వజిత్ రాబర్(25) అనారోగ్యంతో గురువారం మరణించినట్లు అతని అన్న సూరాజ్ రాబర్ పరవాడ పోలీసులకు పిర్యాదు చేశాడు. వివరాలు. ఉదయం 5.30 గంటల సమయంలో విశ్వజిత్ తల తిరుగుతుందని మాత్రలు తీసుకురావాలని అన్నయ్య సురాజ్‌కు చెప్పాడు. మాత్రలు తెచ్చేందుకు లంకెలపాలెం కూడలికి వెళ్లగా అక్కడ షాపులు తెరవకపోవడంతో వెనుదిరిగాడు. ఇంతలో విశ్వజిత్ రూం బయట రోడ్డుపై పడి ఉండడాన్ని గమనించిన సురాజ్ వెంటనే చికిత్స కోసం అగనంపూడి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. డాక్టర్లు పరీక్షించి మరణించినట్లు ధ్రువీకరించారని పోలీసులకు సురాజ్ తెలిపాడు. మృతదేహన్ని పోస్టుమార్టం కోసం కేజీహెచ్‌కు తరలించి, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపారు.

28, 30 తేదీల్లో నియోజకవర్గ స్థాయి పోటీలు

తుమ్మపాల: జీవీఎంసీ మెయిన్ హైస్కూల్, ఎన్టీఆర్ స్టేడియంలో ఈ నెల 28, 30 తేదీల్లో నియోజకవర్గ స్థాయి క్రీడోత్సవాలు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి కె.ఎం నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అనకాపల్లి, కశింకోట మండలాల నుంచి ఎంపికైన క్రీడాకారులకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, యోగా, చెస్, షటిల్, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్ క్రీడాంశాలలో పోటీలు నిర్వహిస్తామన్నారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, జిల్లా విద్యాశాఖ అధికారి ఎం. వెంకటలక్ష్మమ్మ విచ్చేసి పోటీలను ప్రారంభిస్తారని తెలిపారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎంపిక చేసి ఉమ్మడి జిల్లాలో నిర్వహించే జిల్లా స్థాయి పోటీలకు పంపిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 63044 4980 సంప్రదించాలన్నారు.

తగ్గని కూరగాయల ధరలు

కశింకోట: స్థానిక వారపు సంతలో గురువారం ఉల్లి, టమాటా ధరలు బెట్టు మీదే ఉన్నాయి. ఉల్లి, టమాటా రూ.60, బంగాళాదుంప, బీట్‌రూట్, క్యారెట్, బెండకాయ రూ.40, దొండకాయ, వంకాయ రూ.60, బీన్స్, క్యాప్సికం, చేమదుంప రూ.80, ఆగాకర కాయ రూ.వందకు అమ్మకాలు సాగాయి.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కశింకోట: స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి(35) మృతి చెందినట్లు దువ్వాడ జీఆర్పీ ఎస్ఐ శ్రీలక్ష్మి గురువారం తెలిపారు. చామన ఛాయ రంగు కలిగి సిమెంట్ రంగు ఫుల్ హ్యాండ్ షర్టు, నల్ల రంగు ఫ్యాంటు మృతుడు శరీరంపై ఉన్నాయని, ఇక ఎటువంటి ఆధారాలు లేవన్నారు. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతుని ఆచూకీ కోసం బంధువులు తమ పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

ఘనంగా పునర్వసు నక్షత్ర హోమం



హోమాన్ని నిర్వహిస్తున్న వైదికులు

సింహాచలం: పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని సింహగిరిపై గంగధార వద్ద ఉన్న ప్రాచీన రామాలయంలో గురువారం హోమాన్ని విశేషంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని హోమ గుండం వద్ద సీతారాముల ఉత్సవమూర్తులను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, మండపారాధాన, అగ్నిప్రతిష్ట, హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయంలో స్వామివారి చెంతన శ్రీరామ షడక్షరీ, సంక్షిప్త రామాయణ పారాయణాన్ని జరిపారు. భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలు అందించారు.

గోవాడ సుగర్స్‌ను ఆదుకోవాలి

కె.కోటపాడు : గోవాడ సుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం పెరిగిన చెరకు పంట సాగు ఖర్చులను దృష్టిలో ఉంచుకొని మేలైన మద్దతు ధర ప్రకటించాలని ఏపీ చెరకు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేచలపు కాసుబాబు అన్నారు. కె.కోటపాడులో గురువారం ఆయన మాట్లాడారు. గతంలో ఏటా 5 లక్షల టన్నుల క్రషింగ్‌ను చేసేదన్నారు. ప్రస్తుతం క్రషింగ్ లక్ష టన్నులకు పరిమితం కావడం చూస్తే సరైన మద్దతు ధర లేక రైతులు సాగుకు నిరాసక్తత చూపుతున్నట్టు వాపోయారు.

పీహెచ్‌సీలో స్వచ్ఛతా హీ సేవ



పీహెచ్‌సీ ఆవరణను శుభ్రం చేస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు

సబ్బవరం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ అధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పీహెచ్‌సీ అవరణతో పాటు, పరిసర ప్రాంతాలను ఎన్ఎస్ఎస్ వలంటీర్లు శుభ్రం చేశారు. ఆరోగ్యవంతమైన సమాజానికి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని స్థానికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం అధికారి డాక్టర్ లెక్కల గణేష్, విద్యార్థులు పాల్గొన్నారు.